క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: కోరుకొండకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని హెలిప్యాడ్ వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులు ఉన్నారు.

409 మందికి వైద్య పరీక్షలు

కడియం: కడియపులంక సచివాలయం 2 పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 409 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు శిబిరం పర్యవేక్షకులు డాక్టర్ జి.స్వరూప తెలిపారు. రెండవ విడత సురక్ష శిబిరాల్లో భాగంగా డాక్టర్లు కె.ప్రణయ్, ఎస్.రామకృష్ణ, సీహెచ్ ఆనంద రావులతో కూడిన తమ బృందం వైద్య పరీక్షలు నిర్వహించిందన్నారు. ఇద్దరిని ఆరోగ్య శ్రీకి రిఫర్ చేసినట్లు వివరించారు.

3,950 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 3,950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 100, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం తొమ్మిది అడుగులుగా ఉంది.

పేదలకు గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మంగళవారం పేదలకు వంద గొడుగులు పంపిణీ చేశారు. సేవా సంస్థ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనాథలు, ఒంటరి జీవులు, లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం నింపడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది ఇలియాసుద్దీన్, జగదీష్, దివ్య,శిరీష, గంగాధర్ పాల్గొన్నారు.

స్టేట్ కిక్ బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ



గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను అందుకుంటున్న జిల్లా జట్టు

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నంలోని రైల్వే గ్రౌండ్ బాక్సింగ్ హాల్లో ఈ నెల 4, 5వ తేదీల్లో నిర్వహించిన కిక్ బాక్సింగ్ స్టేట్ చాంపియన్‌షిప్, జాతీయ టీమ్ సెలక్షన్స్‌లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాల్గొన్న వారిలో 38 మంది స్వర్ణం, 13 మంది రజతం, 11 మంది కాంస్య పతకాలు సాధించారు. 38 స్వర్ణ పతకాలు సాధించిన జిల్లాకు గ్రాండ్ చాంపియన్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ ఎం.గణేష్, వైస్ ప్రెసిడెంట్ బీకే రత్నం, సెక్రటరీ ఎస్.గిరి వెంకట రమణ, కోశాధికారి ఎం.భవానీ శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.అంజనీకుమార్‌లను స్టేట్ ప్రెసిడెంట్ జి.ఆనంద బాలు అభినందించారు.

11న మూడో ర్యాండమైజేషన్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 11వ తేదీన మూడో ర్యాండమైజేషన్ జరుగుతుందని రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం సెక్టార్ అధికారులు, ఐటీ టీముతో సమావేశం నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్‌కు బుధవారం చివరి అవకాశమన్నారు. సమావేశంలో సెక్టార్ అధికారులు, ఐటీ అండ్ ట్యాబ్‌లేషన్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగం

రాజమహేంద్రవరం రూరల్: ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా 767 మంది ఉపాధ్యాయులు, ఇతర అనుబంధ సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జేసీ, రూరల్ ఆర్వో ఎస్.తేజ్ భరత్ తెలిపారు. బుధవారం ఇదే ఆవరణలో సుమారు 500 మంది పీవోలు, ఇతర అత్యవసర సేవలు అందించే 340 మంది ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.



కోరుకొండలో హెలిప్యాడ్ వద్దకు తరలివచ్చిన ప్రజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజా, ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్



జక్కంపూడి విజయలక్ష్మిని ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం జగన్

జన సునామీ

- సీఎం జగన్ సభకు భారీగా తరలివచ్చిన జనం
- కోరుకొండలో కిక్కిరిసిన రోడ్లు
- ఆశీస్సులు అందించిన వరుణుడు



కోరుకొండ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాజానగరం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార సభ జన సునామీని తలపించింది. నియోజకవర్గంలోని పార్టీ కేడర్‌తో పాటు అభిమాన గణం భారీగా తరలిరావడంతో స్వామివారి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారితో పాటు బస్టాండ్ సెంటర్ యావత్తు జనంతో కిక్కిరిసిపోయింది. 2019 ఎన్నికల సమయంలో పోలింగ్ సమయానికి కొద్ది రోజుల ముందు ఇదే ప్రాంతానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.. అదే సెంటిమెంటుతో ఈసారి కూడా స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి మేరకు కోరుకొండలోనే సభను నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో జనం కోసం తాను చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ సుమారు అర్ధగంటకు పైగా అనర్గళంగా ప్రసంగించి జనంతో జేజేలు అందుకున్నారు. దేవుడి ఆశీసులుంటే మరోసారి మీకు సేవలందించే భాగ్యాన్ని కోరుకుంటున్నానని, అందుకు మీరంతా ఈ ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు చేసి జక్కంపూడి రాజాను ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తిని దేవుడు విన్నాడో ఏమోగాని సభ ముగిసిన తరువాత వరుణుడు ఆశీస్సులు అందించినట్టుగా జల్లులతో జనావళిని ఆహ్లాదపరిచాడు. చేపట్టిన కార్యక్రమం విజయవంతం కావడం, ఆపై వర్షం కురియడంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

ఏకధాటిగా కురిసిన వర్షం

కోరుకొండలో సీఎం జగన్ సభ జరుగుతున్నంత సేపూ ఎండ తీవ్రంగా ఉంది. సభ ముగిసిన కొద్ది సేపటికే మధ్యాహ్నం 12.40 గంటలకు ఆకాశంలో మబ్బులతో వాతావరణం చల్లబడి, చినుకులు ప్రారంభమయ్యాయి. వేసవిలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో పాటు వర్షం సుమారు గంటకు పైగా కురిసింది. కోరుకొండ, రాజానగరం, దివాన్ చెరువు తదితర ప్రాంతాలలో ఏకధాటిగా వర్షం పడింది. రాజానగరంలో గంటపాటు కురిసిన వర్షం 73.3 మి.మీ.గా నమోదయ్యిందంటే వర్షం ఏ మేరకు కురిసిందో అర్థం చేసుకోవచ్చు. దివాన్ చెరువు, పాలచర్ల, శ్రీకృష్ణపట్నం, గాడాల, మధురపూడిలలో భారీ వర్షం పడింది.

పోటెత్తిన జనం

సీతానగరం: ముఖ్యమంత్రి జగన్ హెలికాప్టర్ దిగడానికి ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ప్రజలు పోటెత్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఉదయం 10.30 గంటలకే అక్కడకు చేరుకున్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, మేడపాటి షర్మిలారెడ్డి, తోట నరసింహరావు, గ్రంధి శ్రీనివాస రావు, జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్ తదితరులు ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానించారు. అక్కడి నుంచి కారుపై రోడ్‌షో నిర్వహిస్తూ సభ ప్రాంగణానికి తరలివెళ్లారు. రోడ్డు ఇరువైపులా ప్రజలు బారులు తీరి ఉండటంతో సభ వద్దకు చేరుకోవడానికి సుమారు 40 నిమిషాలు పట్టింది. కోరుకొండలో సభ ముగిసిన అనంతరం ప్రచార బస్సులో సీఎం జగన్‌తో పాటు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి బూరుగుపూడి మీదుగా మధురపూడి విమానాశ్రయానికి వెళ్లారు.

పారదర్శకంగా పాలన

మధురపూడి: ముఖ్యమంత్రి జగన్ రాక ముందు సభా వేదికపై ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఐదేళ్లలో రాజానగరం నియోజకవర్గంలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి పనులు, మరో రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు జరిపామన్నారు. అలాగే 20,170 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పాలన సాగించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ జక్కంపూడి కుటుంబం గురించి మాట్లాడేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి హితవు పలికారు. ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన కుమారుడు జక్కంపూడి రాజాను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న హయాంలో జరిగిన అభివృద్ధి, సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎమ్‌సీ నక్కా రాంబాబు, మేడా గురుదత్త ప్రసాద్ పాల్గొన్నారు.



మండుటెండలో జగన్ కోసం అభిమానంతో ఎదురుచూస్తున్న ప్రజలు





జగన్‌ను చూడగానే అక్కచెల్లెమ్మల ఆనందోత్సాహం

మోదీ, చంద్రబాబు, పవన్‌ల నటన అద్భుతం

ప్రకాశం నగర్: రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ల నటన అద్భుతంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గతంలో ఒకరిపై ఒకరు చేసుకున్న విమర్శలను పరిశీలిస్తే అద్దం కూడా సిగ్గుపడుతుందన్నారు. కాంగ్రెస్‌తోనే విభజన హామీలు అమలు జరుగుతాయని, మోదీ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్‌కు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఏఐసీసీ సెక్రటరీ ఇన్‌చార్జి ఆరతి కృష్ణ, ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్ సామల తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘ ప్రముఖులకు సత్కారం



పీకే రావు, శ్రీకాంత్‌లను సత్కరిస్తున్న గిరజాల వీర్రాజు తదితరులు

కడియం: నియోజకవర్గ పర్యటనలో భాగంగా కడియం గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, దేవదాయ ధర్మాదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌లను వైఎస్సార్ సీపీ నాయకుడు, బాధ్యత సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) మిత్రబృందం ఘనంగా సత్కరించింది. సంఘీయులతో ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన వారికి ఘన స్వాగతం పలికి, శాలువా, పూలమాలలతో సత్కారం చేశారు. కార్యక్రమంలో వేమగిరి సహకార సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ వెలుగుబంటి అచ్యుతరామ్, భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, శాఖ పట్టాభి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, జిల్లా వికలాంగుల సెల్ డైరెక్టర్ ముత్యాల పోసికుమార్, కడియం గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేదాంతం నాని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి

కడియం: బ్రాహ్మణులందరూ ఐక్యంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి తోడ్పడాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మాదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం వారిద్దరూ విస్తృతంగా పర్యటించారు. సంఘీయులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. కడియం, మురమండ, దుళ్ల, ధవళేశ్వరం గ్రామాల్లో సంఘీయులను కలిశారు. ఎమ్మెల్యేగా వేణుగోపాలకృష్ణ, ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు.

ప్రజల సంక్షేమానికి సేవకుడిలా పనిచేస్తా

- మంత్రి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలకృష్ణ
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ, పిల్లి సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల సమయంలోనే కాకుండా ఎల్లవేళలా ప్రజలతో మమేకమవ్వడమే తన అభిమతమని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవకుడిలా పనిచేస్తానని వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శాటిలైట్ సిటీలోని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 300 బీసీ సామాజిక వర్గీయులు ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పిల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ మంత్రి వేణుగోపాలకృష్ణ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వడిసెల నారాయణ నేతృత్వంలో 150 మంది, పిల్లి వెంకటేష్ నేతృత్వంలో 150 మంది పార్టీలో చేరారు. వారిలో గాజుల మణి, పితాని గోవింద్, పితాని కృష్ణ, గండేపల్లి రాము, కోటిపల్లి భవాని, ఎం.సత్యవతి, కాటవరపు కృష్ణవేణి, జి.కృష్ణవేణి, పొన్నాడ దుర్గాభవాని, జి.లక్ష్మి, ఎం.అనురాధ, మగటి కృష్ణమ్మ, జి.సత్యం, పంపన సత్యనారాయణ, వి.శ్రీను ఉన్నారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసగించారన్నారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి అవినీతి రహిత పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకం అందిందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని, పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. పిల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో వేణుగోపాలకృష్ణను ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఎంపీ, సిటీ ఎమ్మెల్యే భరత్‌రామ్
- జోరుగా ఎన్నికల ప్రచారం



ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ఆయన.. భవిష్యత్తులో మరింత సంక్షేమాన్ని అమలు చేయనున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజంతో కలిసి మంగళవారం ఆయన భారీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో ఆజాద్ చౌక్ కిక్కిరిసిపోయింది. జగనన్నకు సంపూర్ణమైన మద్దతు అందించి ముఖ్యమంత్రిని చేయాలని, రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపైనా వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కానుబోయిన సాగర్, హబీబుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు సంక్షేమానికి జగన్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రౌతు సూర్యప్రకాశరావు, చిత్రంలో మంత్రి వేణుగోపాలకృష్ణ

కడియం: తూర్పుకాపు సంఘీయుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని ఆ సంఘ నాయకుడు, రుడా చైర్‌పర్సన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. మండలంలోని జీఎస్ఆర్ కల్యాణ మండపంలో మంగళవారం తూర్పు కాపు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రౌతు మాట్లాడుతూ ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు సీఎం జగన్ ఎంతో కృషి చేశారన్నారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా వేణు, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. విశిష్ట అతిథిగా మంత్రి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ హాజరయ్యారు. సమావేశంలో తూర్పు కాపు కార్పొరేషన్ మామిడి శ్రీకాంత్, పార్టీ నాయకులు గిరజాల వీర్రాజు, యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, తాడాల చక్రవర్తి, సేపేని రమణమ్మ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకం



పోలింగ్ సిబ్బంది డెమోను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్లు మరింత బాధ్యతగా, జవాబుదారీతనంతో ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో మంగళవారం పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, పోలింగ్ నిర్వహణ తదితర అంశాలపై సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం, కమల్ కాంత్ సరోజ్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ ముందు రోజే కేంద్రాలకు వెళ్లి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు పాల్గొన్నారు.

నోటీసులు జారీ చేయండి

రాజమహేంద్రవరం రూరల్: పోస్టల్ బ్యాలెట్‌కు డబ్బుల పంపిణీపై పత్రికల్లో, వివిధ మాధ్యమాల్లో వచ్చిన వార్తలను గుర్తించి, ఆయా పార్టీలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. పోలింగ్ రోజు చేయాల్సిన ఏర్పాట్లు, సిబ్బంది మోహరింపు, విస్తరణ, ఓటరు స్లిప్పుల పంపిణీ, నివేదికలు తదితర అంశాలపై మంగళవారం సాయంత్రం వెలగపూడి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వందశాతం ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు.

భారీ వర్షం.. అనుకోని నష్టం

సీటీఆర్ఐ/కడియం/రాజమహేంద్రవరం రూరల్: అప్పటి వరకూ భానుడి తన ఎండతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయగా, ఇక తన వంతు అన్నట్టు వరుణుడు విజృంభించాడు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం నుంచే భానుడు నిప్పులు చెరిగాడు. మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. సిటీ, రూరల్ నియోజకవర్గాలలో రోడ్లు జలమయమయ్యాయి. ఈదురుగాలికి చెట్లు విరిగిపడ్డాయి. రోడ్లపై ట్రాఫిక్ స్తంభించింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, వైర్లు తెగిపోవడం వల్ల సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.



భారీ వర్షానికి నగరంలో కూలిపోయిన చెట్టు



వేమగిరి పంచాయతీలోని జక్కంపూడినగర్‌లో విరిగిన విద్యుత్ స్తంభం



బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాల గదుల్లోకి చేరిన వర్షం నీరు



మోరంపూడి జంక్షన్‌లో ఒరిగిపోయిన లోడు లారీ